క్లుప్తంగా

ఏయూలో పెన్షనర్స్ డే



పెన్షనర్స్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షనర్స్ డే ని ఘనంగా నిర్వహించారు. ఏయూ రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ గొలగాని అప్పారావు, అధ్యక్షుడు ఎన్. శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి సి. నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సత్కరించారు.

వెలమ సంక్షేమ సంఘానికి స్థలాన్ని కేటాయించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వెలమ సంఘం ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50 లక్షలకు పైగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి ఉపయుక్తంగా భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవింద రావు కోరారు. మంగళవారం నోవాటెల్ హోటల్‌లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ నగరంలో 5 ఎకరాలు స్థలం కేటాయించాలని కోరారు. అదే విధంగా విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలోని తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు కొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును కొనసాగించాలని కోరారు. ఆర్థిక, సామాజికంగా వెనకబడిన వెలమ సామాజిక వర్గాన్ని బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్పు చేయాలని కోరారు.

గెడ్డలో పూడిక తొలగింపు



గెడ్డలో పూడిక తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులోని డాక్టర్స్ కాలనీ ప్రాంతంలోని గెడ్డలో పేరుకుపోయిన పూడికను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డు కార్పొరేటర్ ముువ్వల లక్ష్మీసురేష్..జీవీఎంసీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లగా మంగళవారం జీవీఎంసీ సిబ్బంది పూడికను తొలగించారు. ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాకీర్ హుస్సేన్ మృతికి సంతాపం

మద్దిలపాలెం: ప్రపంచం గర్వించ దగ్గ తబలా వాయిద్య కళాకారుడు జాకీర్ హుస్సేన్ మృతి తీరని లోటని వైజాగ్ ఫిల్మ్‌సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తబలా వాయిద్య పరికరానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకు వచ్చిన భారతీయ కళాకారుడు హుస్సేన్ అని కొనియాడారు.

ఈస్ట్ పాయింట్ కాలనీవాసుల హ్యాపీ

20 ఏళ్ల కల నెరవేర్చిన కార్పొరేటర్

20 ఏళ్ల పోరాటం ఫలించింది
ఆక్రమణదారులకు చెక్ పడింది
స్థానిక కార్పొరేటర్ చొరవతో సమస్యపరిష్కారమైంది
పార్కు ప్రజల సొంతమైంది
దీంతో స్థానికుల్లో సంతోషం వెల్లువెత్తింది.



కాలనీ వాసులతో కార్పొరేటర్ లక్ష్మీ సురేష్

★ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ముువ్వల లక్ష్మీ సురేష్
★ స్పందించిన జీవీఎంసీ కమిషనర్
★ కమిటీ ఏర్పాటయ్యే వరకు పార్కు నిర్వహణ బాధ్యత తీసుకున్న జీవీఎంసీ

బీచ్‌రోడ్డు : ఏయూ ఎంప్లాయీస్ హౌసింగ్ లేవుట్లను జీవీఎంసీ 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీలో 1970లో ఏర్పాటు చేశారు. ఈ లేవుట్లలో పిల్లల పార్కు..ఇతర పార్కుల కోసం నాలుగు ఖాళీ స్థలాలను కేటాయించారు. ఇందులో ఒక స్థలంలో కేడీపీఎం హైస్కూల్ నిర్మించగా మరోక స్థలంలో చిన్న పిల్లల పార్కును అభివృద్ధి చేశారు. అయితే మరో రెండు ఖాళీ స్థలాలను 20 ఏళ్ల క్రితం వేరే లేవుట్‌కు చెందిన వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లెండి వనం పార్కు, బాబా చావడి పార్కులో శివాలయాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ పార్కులోకి స్థానికులను అనుమతించ కుండా తాళం వేయడంతో 20 ఏళ్లుగా ఈస్ట్ పాయింట్ కాలనీవాసులు పోరాడుతున్నారు.

ఏళ్ల నాటి పార్కు సమస్య పరిష్కారం
వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ చొరవ
సంతోషం వ్యక్తం చేసిన స్థానికులు

కార్పొరేటర్ దృష్టికి సమస్య..

ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న పార్కులను తిరిగి స్థానికులకు అప్పగిస్తామని జీవీఎంసీ ఎన్నికల సమయంలో 20వ వార్డు నుంచి పోటీ చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ముువ్వల లక్ష్మీసురేష్ హామీ ఇచ్చారు. ఈస్ట్ పాయింట్ కాలనీ పార్కు సమస్యపై కార్పొరేటర్ తరచూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జీవీఎంసీ కౌన్సిల్‌లో పార్కు విషయంపై గళమెత్తారు. దీంతో కౌన్సిల్ సానుకూలంగా స్పందించింది.

జీవీఎంసీ కమిషనర్‌కు వినతి..

ఈస్ట్ పాయింట్ కాలనీ సమస్య కోసం కౌన్సిల్‌లో ప్రస్తవించిన విషయమై వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముువ్వల సురేష్ జీవీఎంసీ కమిషనర్‌కు ఇటీవల వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ పార్కులను తక్షణమే స్థానికులకు అప్పగించాలని హార్టీకల్చర్ విభాగ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం జీవీఎంసీ సిబ్బంది ఈస్ట్ పాయింట్ కాలనీకి చేరుకుని వేరే వ్యక్తుల ఆధీనంలో ఉన్న పార్కులను స్థానికులకు అప్పగించారు. పార్కు తాళాలను స్థానికులకు అప్పగించారు.

నెల రోజులు జీవీఎంసీ ఆధ్వర్యంలో..

20 ఏళ్ల కల సాకారం అయింది. పార్కును స్థానికులు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్కు నిర్వహణకు అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవాలని జీవీఎంసీ సూచించింది. నెల రోజులు సమయం కూడా ఇచ్చింది. అసోసియేషన్ ఏర్పాటు చేసుకునేవరకు పార్కు నిర్వహణను జీవీఎంసీ చేపడుతుందని అధికారులు తెలిపారు. అసోసియేషన్ ఏర్పాటు అయిన తరువాత పూర్తిగా పార్కు నిర్వాహణ బాధ్యతలు అప్పగించనున్నారు..



జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న ముువ్వల సురేష్ (ఫైల్)

పార్కును అభివృద్ధి చేస్తాం



మా ఆధ్వర్యంలో ఇప్పటికే పిల్లల పార్కును అభివృద్ధి చేశాం. వాకింగ్ కోసం సరైన పార్క్ లేదని ఎన్నో ఏళ్లుగా బాధపడుతున్నాం. ఇప్పుడు మాకప్పగించిన స్థలాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. కార్పొరేటర్ లక్ష్మీసురేష్ చొరవతో పార్కు మా ఆధీనంలోకి వచ్చింది. చాలా సంతోషం ఉంది. సమష్టిగా పార్కును అభివృద్ధి చేసుకుంటాం.

– డి.సుధ, స్థానికురాలు

చాలా సంతోషంగా ఉంది



1970లో మా నాన్న హయాంలో ఈ లేవుట్లను ఏర్పాటు చేశారు. అప్పుడు పార్కుల కోసం అని విడిచిపెట్టిన స్థలాలను వేరే వ్యక్తులు స్వాధీనం చేసుకొని పెత్తనం చెలాయించారు. ఈ పార్కు సమస్య పరిష్కరం కోసం కొన్నేళ్లగా జీవీఎంసీ చుట్టూ తిరుగుతున్నాం. కార్పొరేటర్ ముువ్వల లక్ష్మీసురేష్ చొరవతో పార్కు మా ఆధీనంలోకి రావడం చాలా సంతోషంగా ఉంది.

– ఆర్ బంగారు రాజు, అధ్యక్షుడు, ఈస్ట్ పాయింట్ చిల్డ్రన్ పార్కు అసోసియేషన్

స్థానికులకు అండగా ఉంటా..



వార్డులో ఉండే స్థానికులకు ఎటువంటి సమస్య వచ్చిన అండగా ఉంటా. ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రజలు ఈ పార్కు సమస్యను నా దృష్టికి తీసుకొని వచ్చారు. తాను కౌన్సిల్ ప్రస్తావించి సమస్యను ఉన్నాతాధికారులు దృష్టికి తీసుకువెళ్లా..జీవీఎంసీ ఉన్నాతాధికారులు స్పందించి ఈ పార్కును స్థానికులకు అప్పగించారు. వారికి కృతజ్ఞతలు చెబుతున్నా..పార్కు అభివృద్ధికి తనవంతు సహాయసహకారాలు అందిస్తా.

–ముువ్వల లక్ష్మీ సురేష్, 20వ వార్డు కార్పొరేటర్

ఏయూలో సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ కట్ చేస్తున్న ఆచార్య విజయ్ మోహన్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులతో కలిసి, కేంద్రం సంచాలకులు ఆచార్య ఎస్. విజయ్ మోహన్ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దూరవిద్యా కేంద్రం అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో నేషనల్ జెండర్ క్యాంపెయిన్



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్, ఈసీసీ, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో ఉన్నత విద్యాశాఖ, యూజీసీ ఆదేశాల మేరకు కళాశాలలో మంగళవారం 'నేషనల్ జండర్ క్యాంపెన్ నయా చేతన' 3.0 ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జండర్ బెస్డ్ వయలెన్స్‌లో భాగంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థినులు ఎప్పటికప్పుడు పురుషులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ కో ఆర్డినేటర్ కుసుమ కుమారి, అనురాధ, సుభాషి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయోగశాలల పనులు వేగవంతం



ప్రదీప్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీ4ఐ4 ప్రయోగశాలల పనులు వేగవంతం చేయాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనంజయరావు అధికారులకు ఆదేశించారు. త్వరలో దీనికి సంబంధించిన పరికరాలు పూర్తిస్థాయిలో ఏయూకు రానున్నాయన్నారు. మంగళవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ధనుంజయ రావుతో సమర్థ ఉద్యోగ్ డైరెక్టర్ ప్రదీప్ సమావేశమయ్యారు. సెంటర్ ఫర్ ఇండస్ట్రీ 4.0 ఉపయోగాలను వివరించారు. సీ4ఐ4 ల్యాబ్ నుంచి వైవిధ్యమైన కోర్సులను డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఎంఎస్ఎంఈ, ఇండస్ట్రీస్‌లో పనిచేసే వారికి అందించవచ్చునన్నారు. భవిష్యత్తులో ఏయూలో ఎలక్ట్రికల్ వెహికల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని రిజిస్ట్రార్ ధనుంజయ రావు కోరారు. కార్యక్రమంలో ఆచార్య కె. శ్రీనివాసరావు, ఆచార్య వజీర్ మొహమ్మద్, ఆచార్య కె.బసవయ్య, యూనివర్సిటీ ఇంజనీర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వర్సిటీ తరపున సమర్థ ఉద్యోగ్ డైరెక్టర్ ప్రదీప్ ను సత్కరించారు.

వ్యాధి నిరోధక టీకాల పోస్టర్ విడుదల

మహారాణిపేట: వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారులు, ఇతర అధికారుల సమక్షంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణుల సేవలు, సపోర్ట్ సూపర్ విజన్, వ్యాధి నిరోధక టీకాలను సిబ్బందికి వివరించారు. కిల్కారి సేవలపై ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డాక్టర్ ఎన్.వి.సమత, జిల్లా సమన్వయకర్త కె.ధర్మేంద్ర, మణికుమారి, ఆశా నోడల్ అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ప్లాస్టిక్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ఒకసారి వాడి వదిలేసిన ప్లాస్టిక్ వద్దేవద్దని ఎస్ఆర్‌యూ–జీవీఎంసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ దాట్ల వివేక్ వర్మ అని కోరారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాలు అనుసరించి మంగళవారం శివాజీ పాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి ఒకటి నుంచి 16 రకాల ప్లాస్టిక్‌పై పూర్తి ఆంక్షలు అమలు చేస్తామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులందరూ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు వివరించాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాడి వదిలేసే ప్లాస్టిక్ వల్ల జీవవైవిధ్యానికి, భవిష్యత్తు తరాలకు కలిగే నష్టాలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రమీల, దివ్య, మంగరాజు, అధ్యాపకురాలు మురహర రావు గాంధీ, గ్రీన్ వలంటీర్ రవితేజ పాల్గొన్నారు.

ముడసర్లోవ పార్కుపై ఎందుకింత నిర్లక్ష్యం

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు ప్రహరి శిథిలమైంది. ప్రహరి కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు దీని నిర్మాణం చేపట్టలేదు. దీంతో టికెట్ తీయకుండానే కొందరు పార్కు లోపలకు ప్రవేశిస్తున్నారు. హుద్‌హుద్ తుపాను కంటే ముందే ప్రధాన ద్వారం పక్కన గోడ కూలిపోయింది. హుద్‌హుద్ తుపాను ధాటికి మరికొంత గోడ భాగం కూలిపోయింది. అప్పటి నుంచి ఇంతవరకు ఈ గోడ నిర్మాణం గురించి జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. గతంలో ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పార్కు బాధ్యతలను జీవీఎంసీ అప్పగించింది. అధికారులు ఇక్కడ గోడ నిర్మాణం చేపట్టకపోవడం, పార్కు లోపల సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు పెద్దగా వెళ్లడం మానేశారు. గోడ కూలిపోయిన కారణంగా ఎక్కువ మంది టికెట్ తీయకుండానే లోపలకు ప్రవేశిస్తుండడంతో లాభాలు రావడంలేదని ప్రైవేట్ వ్యక్తులు ఎవ్వరూ ఈ పార్కు నిర్వహణ బాధ్యతలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. కూలిన రక్షణ గోడ నిర్మించకుండా అధికారుల చూపుతున్న నిర్లక్ష్యంపై స్థానికులు విమర్శిస్తున్నారు.



కూలిపోయిన ముడసర్లోవ పార్కు గోడ

చలికాలంలో పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు



చినగదిలి ఏడీ శ్రీనివాసారావు

ఆరిలోవ: శీతా కాలంలో పశువుల పట్ల యజమానులు జగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం కొద్ది రోజులగా చలి బాగా పెరుగుతోంది. దీంతో పశు సంవర్ధక శాఖ అధికారులు పశువులు పెంచుతున్న రైతులకు సూచనలు ఇస్తున్నారు. శీతా కాలంలో పశువులు పట్లు రైతులు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో చినగదిలి మండలం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు మంగళవారం సాక్షికి తెలిపారు.

- ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల పశువుల ఒత్తిడికి గురవుతాయి. సాధారణంగా చల్లని వాతావరణంలో ఆవులు, గేదెల పాల దిగుబడి తగ్గుతుంది.
- చలి పెరిగిన సమయంలో మరింత దిగుబడి తగ్గుతుంది. పాల దిగుబడి తగ్గకుండా ఉంచడానికి రోజు మాదిరిగా అందించే దానాకు మరో 20 శాతం అదనంగా ఖనిజ లవణాలు మిశ్రమంతో కూడిన దానా కలిపి పశువులకు ఇవ్వాలి. గోరు వెచ్చని నీటిని అందించాలి.
- పశువులను గాలి, సూర్యరశ్మి బాగా ఉండే ప్రదేశంలోఉంచాలి. లేదంటే శ్వాస సమస్యలు వస్తాయి.
- వాటిని ఉంచే షెడ్‌లో నేల పొడిగా ఉండేవిధంగా చూడాలి. దానిపై ఎండు గడ్డి పరుపుగా వేయాలి. చల్లగాలులు నుంచి దూడలను కాపాడడానికి గోనె సంచులతో కుట్టించిన దుప్పట్లు, కోట్లు కప్పాలి. చలి గాలి షెడ్‌లోపలకు వెళ్లకుండా రాత్రులు చుట్టూ టార్పన్‌లు చుట్టాలి.
- చలికాలంలో పాడి పశువులకు మసూచి వ్యాధి సోకే అవకాం ఉంటుంది. గేదెలలో కంటే ఆవులలో ఈ వ్యాధి రావడానికి అవకాశం ఎక్కువ. ఈ వ్యాధి వల్ల పశువు పొదుగుపైన, పాల మొనలు పైన పొక్కులు, పగుళ్లు ఏర్పడతాయి. దీనివల్ల వాటి పాలు పితకడం కష్టమవుతుంది. ఈ వ్యాధి సోకిన పశువులకు పగుళ్లపై బోరిక్ యాసిడ్ ఆయింట్‌మెంట్ రాయాలి.



గోనె సంచితో తయారు చేసిన కోటుతో దూడ(ఫైల్)

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు

ఏయూ వ్యాయామ విద్యావిభాగం డైరెక్టర్ ఆచార్య విజయమోహన్

విశాఖ విద్య: క్రీడల్లో ప్రతిభ సాధిస్తే ఉపాధికి మార్గాలు చూపిస్తాయని ఏయూ వ్యాయామ విద్యావిభాగం డైరెక్టర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆంధ్రాయూనివర్సిటీకి ఎంపికైన మహిళల బాస్కెట్ బాల్ జట్టును అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ యూనివర్సిటీ మహిళల బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు స్కూల్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్, కొట్టాం, మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈనెల 20 నుంచి 24 వరకు జరుగుతాయన్నారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి మాట్లాడుతూ మహిళల బాస్కెట్ బాల్ క్రీడలో ప్రతిభ సాధించి వర్సిటీ మంచి పేరుతీసుకు రావాలన్నారు.



క్రీడాకారులతో స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ విజయ మోహన్ తదితరులు

నిరుపయోగంగా స్కిల్ డెవలప్‌మెంట్ భవనం

ఆరిలోవ: ముడసర్లోవ ప్రాంతంలో రూ. కోట్లు నిధులతో నిర్మించిన జీవీఎంసీకి చెందిన భవనం నిరుపయోగంగా మారింది. జీవీఎంసీకి చెందిన సుమారు రెండు ఎకరాల స్థలంలో 11 ఏళ్ల క్రితం రూ.6 కోట్లు ఖర్చుచేసి జోనల్ కార్యాలయం కోసం విశాలమైన భవనాన్ని అధికారులు నిర్మించారు. నిర్మించిన అనంతరం జోనల్ కార్యాలయం ఏర్పాటు చేయకుండా స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహణ కోసం హెచ్‌పీసీఎల్‌కు లీజుకు అప్పగించేశారు. లీజు గడువు ముగియడంతో గత ఏడాది నవంబరులో హెచ్‌సీపీఎల్ యాజమాన్యం ఈ భవనాన్ని ఖాళీ చేసి జీవీఎంసీకి అప్పగించింది. అప్పటి నుంచి ఈ భవనాన్ని వేరే కార్యాలయానికో, ఇంకేమైన అవసరాలు కోసమో వినియోగించకుండా ఖాళీగా వదిలేశారు. ఖాళీగా ఉన్న ఈ భవనం లోపల గోడలు పలుచోట్ల పెచ్చులూడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయి భవనమంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది. నివాసాలకు దూరం కావడంతో పాటు చుట్టూ పిచ్చి మొక్కలు, పక్కనే మామిడి తోట ఉండటంతో రాత్రులు ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉంటుంది. దీంతో ఈ భవన గదుల్లో గంజాయి, మద్యం తాగడం తదితర అసాంఘిక కార్యకలాపాలకు కొందరు వినియోగించుకొంటున్నారు. రెండు నెలల క్రితం ఈ భవనాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ కూడా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



ముడసర్లోవ వద్ద స్కిల్ డెవలప్‌మెంట్ భవనం